

ఘనంగా వారంతపు పూజలు

విశాఖ: రుషికొండలో శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వారాంతపు పూజలు ఘనంగా నిర్వహించారు.



కనకమ్మకు క్షీరాభిషేక సేవ

విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.



నేడు పంచామృతాభిషేకం

విశాఖ నగరంలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పంచామృతాభిషేకం నిర్వహిస్తున్నారు.

8లో

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో విశ్వశాంతి హోమం

- ఘనంగా పాకలపాటి గురుదేవుల జయంతి



ఆలయ ఆవరణలో హోమం నిర్వహిస్తున్న మత్స్యరాజు, గాయత్రి దంపతులు

జి.మాడుగుల: పాకలపాటి గురుదేవుల జయంతిని శుక్రవారం స్థానిక గురుదేవుల ఆలయంలో భక్త సంఘం అధ్యక్షుడు మత్స్యరాస మత్స్యరాజు, గాయత్రి దంపతుల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుదేవుల ఆలయంల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు విశ్వశాంతి హోమం నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు. భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి, సర్పంచ్ కిముడు రాంబాబు, శర్మ మాస్టారు, సమరసతా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మత్స్యరాజు, భక్తులు అడపా బాబూరావు, ఆతవ శ్రీను పాల్గొన్నారు.

కొసంగూడకు విద్యుత్ సౌకర్యం

- చురుగ్గా విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు
- గత ప్రభుత్వంలో సంస్కరణల ఫలితం



ఏర్పాటుచేస్తున్న విద్యుత్ లైన్

ముంచంగిపుట్టు: గత ప్రభుత్వంలో చేపట్టిన సంస్కరణల ఫలాలు గిరిజనుల గూడెల్లో వెలుగులు నింపనున్నాయి. మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ కొసంగూడ గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానిక సర్పంచ్ రత్న, ఎంపీటీసీ కొండమ్మలు విద్యుత్ సమస్యను గత ప్రభుత్వంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అప్పటిలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన అధికారులు విద్యుదీకరణ పనులను వేగవంతం చేశారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చివరి దశకు చేరుకున్నాయి. కొద్ది రోజుల్లో ఈ గ్రామంలో విద్యుత్ వెలుగులు విరజిమ్మనున్నాయి.

పశువుల వ్యాన్ బోల్తా

- 15 జీవాలు మృత్యువాత
- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



పాడేరు ఘాట్ రోడ్డులో బోల్తా పడిన పశువుల వ్యాన్

పాడేరు : ఏజెన్సీ నుండి మైదాన ప్రాంతానికి వెళ్తున్న పశువుల వ్యాన్ పాడేరు ఘాట్ రోడ్డులో బోల్తా పడింది. మండలంలోని గుత్తులపుట్టు వారపు సంతలో గురువారం మూగజీవాలను కొనుగోలు చేశారు. వాటిని శుక్రవారం ఉదయం వ్యాన్‌లో రాజమండ్రి ప్రాంతానికి తరలిస్తుండగా పాడేరు ఘాట్‌లోని యేసుప్రభు విగ్రహం మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో సుమారు 15 పశువులు ప్రాణాలు కోల్పోయాయి. కొన్నింటికి తీవ్రంగా గాయపడగా, వ్యాన్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్ వల్లే వ్యాన్ బోల్తాకు కారణమని స్థానికులు తెలిపారు. పోలీసు అధికారులు స్పందించి పశువుల అక్రమ తరలింపునకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పిచ్చికుక్క దాడి.. ఐదుగురికి గాయాలు



పిచ్చి కుక్క దాడిలో గాయపడిన అక్కచెల్లెళ్లు అవంతిక, నూకరత్నం

గంగవరం : మండలంలోని గంగవరం, లక్కొండ గ్రామాల్లో పచ్చికుక్క స్వైర విహారం చేసి ఐదుగురిని గాయపరిచింది. శుక్రవారం ఉదయం లక్కొండ గ్రామంలో ముర్ల అవంతిక, ముర్ల నూకరత్నం అనే ఇద్దరు అక్కచెల్లెళ్లను, గంగవరంలో మరో ముగ్గిరిపై దాడి చేసి గాయపరిచింది. వీరికి స్థానిక పీహెచ్‌సీలో వైద్యం అందించారు.

ఆర్‌జీఎల్ వద్దే వద్దు

- ఈ రకం విత్తనాలకు ముగిసిన కాలపరిమితి
- ఏటా సరఫరా తగ్గిస్తున్న వ్యవసాయశాఖ
- గతేడాది 4,100 క్వింటాళ్ల సరఫరా
- ఈ ఏడాది 3,600 క్వింటాళ్లకు తగ్గింపు
- ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318, 1064 వరి రకాల సిఫార్సు
- రైతులకు అవగాహన కార్యక్రమాలు

గత 20 ఏళ్లుగా రైతుల కమతాల్లో సిరులు పండించిన ఆర్‌జీఎల్ 2527 వరి రకం విత్తనాల శకం ముగియనుంది. వీటి కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో ఈ రకం విత్తన సరఫరాను రానున్న కాలంలో పూర్తిగా వ్యవసాయశాఖ నిలిపివేయనుంది. ఇప్పటికే ఏటా సరఫరాను తగ్గించేసింది. దీనికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318, ఎంటీయూ 1064 రకాలను సాగు చేయాలని రైతులకు సూచిస్తోంది. ఆర్‌జీఎల్ రకం వరిసాగుకు స్వస్తి చెప్పకుంటే దిగుబడి తగ్గి ఆర్థిక ఇబ్బందుల బారిన పడాల్సిన పరిస్థితులు ఎదురవుతాయని రైతులకు అవగాహన కల్పిస్తోంది.



ఆర్‌జీఎల్ రకం వరి సాగులో పాల్లు కంకులు





ఆర్‌జీఎల్‌కు బదులు సిఫార్సు చేస్తున్న ఎంటీయూ1318, ఎంటీయూ1064 వరి రకాలు

కొయ్యూరు: రైతులు ఒక రకం వరి సాగుకు అలవాటు పడితే దానిని ఎక్కువ కాలం పండించేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఆర్‌జీఎల్ రకం వరి సాగు విషయంలో ఇదే జరుగుతోంది. స్థానికంగా సోనామసూరి అని పిలుస్తుంటారు. ఈ రకం రైతుల కమతాల్లో మంచి దిగుబడి ఇవ్వడం, స్థానికంగా ఈ రకం ధాన్యానికి డిమాండ్ ఉన్నందున గత 20 ఏళ్లుగా సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. జిలావ్యాప్తంగా ఈ రకం సాగు ఎక్కువ విస్తీర్ణంలోనే ఉంటోంది. అయితే ఇప్పుడు కాలపరిమితి ముగియడంతో రైతులకు ఈ రకం విత్తన సరఫరాను వ్యవసాయశాఖ క్రమేపీ తగ్గించేస్తోంది. గతేడాది జిల్లాలో 4,100 క్వింటాళ్ల విత్తనాన్ని సరఫరా చేసిన వ్యవసాయశాఖ ఈ ఏడాది 3,600 క్వింటాళ్లకు కుదించేసింది. అంటే దాదాపుగా 600 క్వింటాళ్ల విత్తన సరఫరాను తగ్గించింది.

నష్టమిలా..

ఆర్‌జీఎల్ రకం విత్తనకాలపరిమితి తగ్గడం వల్ల క్రమేపీ దిగుబడి తగ్గుతుంది. కేళీలు, పాల్లు గింజల సమస్య ఎక్కువగా ఉంటుంది. అక్టోబర్‌లో కురిసే మంచు వల్ల పూత దెబ్బతింటోంది. వ్యాధి నిరోధక శక్తి కోల్పోవడం వల్ల పైరు తెగుళ్ల బారిన పడుతుంది. ఆర్‌జీఎల్ విత్తనాన్ని పరిచయం చేసిన తొలినాళ్లలో 165 రోజుల పంట కాలంలో ఎకరాకు 30 బస్తాలు (75 కిలోలు) దిగుబడి వచ్చేది. ఇప్పుడు 25 బస్తాలకు దిగుబడి తగ్గిపోయింది. ఇప్పటివరకు జిల్లాలో 90 శాతం రాయితీపై వ్యవసాయశాఖ సరఫరా చేస్తోంది. విత్తనానికి కాలపరిమితి ముగియడం వల్ల నిబంధనల ప్రకారం రాయితీ కూడా నిలిచిపోయే అవకాశం ఉంది.

ప్రత్యామ్నాయ రకాలివే..

ఆర్‌జీఎల్‌కు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318, ఎంటీయూ 1064 వరి రకాలను సాగు చేయాలని వ్యవసాయశాఖ సిఫార్సు చేస్తోంది. ఈ రకాలు బెట్ట పరిస్థితులను తట్టుకుంటాయని రైతులకు అవగాహన కల్పిస్తోంది.

ప్రత్యేకతలివీ..

ఎంటీయూ 1318: వరి పూర్తిగా సన్నరకం. ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది. పంట కాలం 150 రోజులు, తెగుళ్ల ప్రభావం తక్కువగా ఉంటుంది. సాగుకు ఏజెన్సీ వాతావరణం అనుకూలం. మంచి దిగుబడి పొందవచ్చని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఇప్పటికే సిఫార్సు చేశారు.

ఎంటీయూ 1064: కాస్త ముతకగా ఉండే ఈ రకాన్ని కూడా ఆర్‌జీఎల్‌కు ప్రత్యామ్నాయంగా సాగు చేయవచ్చు. ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు దిగుబడి వస్తుంది. ఏజెన్సీ వాతావరణ పరిస్థితులు అనుకూలం. 150 రోజుల్లో పంట చేతికి వస్తుందని వ్యవసాయశాఖ చెబుతోంది. ఈ రకాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధిక ప్రాధాన్యమిస్తోంది.

విస్తృత ప్రచారం



కాలపరిమితి ముగిసిన ఆర్‌జీఎల్ వరి రకాన్ని సాగు చేయడం వల్ల దిగుబడి తగ్గి నష్టపోవాల్సి ఉంటుంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318, 1064 రకాలను సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కాల పరిమితి ముగియడం వల్ల ఆర్‌జీఎల్ విత్తనాలకు రాయితీ నిలిచిపోయే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని సిఫార్సు చేసిన ప్రత్యామ్నాయ రకాలను రైతులు సాగు చేపట్టాలి.

– నందు, జిల్లా వ్యవసాయ అధికారి, పాడేరు

లాహిరి.. లాహిరిలో..





సాగరతీరంలో నౌకలో విహరిస్తున్న శ్రీనివాసుడు, చిత్రంలో అధికారులు

- నయన మనోహరం.. పోర్టు వెంకన్న నౌకా విహారం
- ఘనంగా తెప్పోత్సవం

డాబాగార్డెన్స్ (విశాఖ): నిత్యం పాల కడలిలో పవళించి ముల్లోకాలను బ్రోచే నారాయణుడు వేంకటేశుడై జలధిలో విహరించిన మనోహర దృశ్యం సాగరతీరంలో ఆవిష్కృతమైంది. సాగరానికి చేరువలోని శృంగమణి శిఖరం.. ఆ రమణీయ దృశ్యాన్ని చూసి తరించింది. ఈ దివ్య ఘట్టాన్ని తిలకించి భక్తజనకోటి మురిసింది. పోర్టు ప్రాంతంలోని శృంగమణి పర్వతంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం సాయంత్రం తెప్పోత్సవం నయన మనోహరంగా సాగింది. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన హోమాలు, బలిహరణం, తీర్థగోష్ఠి చేశారు. సాయంత్రం 4 గంటలకు స్వామి వారి ఉత్సవమూర్తులను ముందుగా పల్లకిలో మెట్లమార్గం మీదుగా కిందకు తీసుకొచ్చారు. అనంతరం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, పలువురు ప్రముఖులు స్వామివారి పల్లకిని మేళతాళాలు, అర్చక స్వాముల వేదమంత్రాల నడుమ తెప్పోత్సవానికి సిద్ధంగా ఉన్న నౌక వరకూ మోసుకొచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించిన నౌకపై అధిష్టింపజేశారు. భక్తులు ప్రయాణించే లాంచీలు అనుసరించగా.. స్వామి కాసేపు తెప్పపై సాగర విహారం చేశారు. అనంతరం స్వామిని తిరిగి ఆలయానికి తోడ్కొళ్లారు. ఆనందోత్సాహాల నడుమ జరిగిన ఈ తెప్పోత్సవాన్ని చూసి భక్తులు పరవశించిపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, ఆలయ ప్రధానాచార్యుడు శ్రీనివాస జగన్నాథాచార్యులు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారిని పల్లకిలో ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

నేటి కార్యక్రమాలు..

వార్షిక తిరు కల్యాణోత్సవంలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పూర్ణాహుతి, చూర్ణోత్సవం, సముద్ర స్నానం(చక్రస్నానం), సాయంత్రం 6 గంటలకు ఆరాధన చూర్ణోత్సవం(దొంగల దోపు ఉత్సవం), ధ్వజ అవరోహణం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం



తలార్‌సింగి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ

పాడేరు : యోగా ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడటమే కాకుండా మానసిక ప్రశాంతత చేకూరుతుందని జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలో తలార్‌సింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరు ఎదుర్కొంటున్న ఒత్తిడిని జయించేందుకు యోగా ఓ గొప్ప సాధనమన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి యోగా చేయడం వల్ల శారీరక ధారుడ్యంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సమగ్ర శిక్ష ఏఎంవో, ఈఈ కోఆర్డినేటర్ కొమ్మా భాస్కర్‌రావు మాట్లాడుతూ యోగా ఒక గొప్ప ప్రక్రియ అన్నారు. యోగాతో మానసిక పరివర్తనను సాధించవచ్చన్నారు. శారీరకంగా మానసికంగా మార్పు చోటుచేసుకుంటుందని చెప్పారు. విద్యార్థులు క్రమం తప్పకుండా యోగసానాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సిబ్బంది, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ర్యాలీలో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, వైద్యసిబ్బంది

మానసిక ప్రశాంతతకు దోహదం

హుకుంపేట: యోగాసనాల వల్ల ఒత్తిడిని అధిగమించి మానసిక ప్రశాంతత పొందవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జమాల్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి డా.గాయత్రి ఆధ్వర్యంలో యోగాపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ చూపించాలన్నారు. యోగా చేయడం వలన మానసిక ప్రశాంతతతో పాటు రోగాలకు దూరంగా ఉండవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సాంబశివరావు, యోగి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ కూర్మారావు

జి.మాడుగుల: బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కో ఆర్డినేటర్ కూర్మారావు ఆదేశించారు. మండలంలో నుర్మతి, రాపల్లి, వి.కోడాపల్లి గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలలు, అలాగే పాఠశాలలు లేని సిరసపల్లి, జోలుగులగొయ్యి, సలమరంగి, భూంబొడ్డు గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలంతా బడిలో ఉండాలని పాఠశాల విద్యాశాఖ ఈ బహుత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు. ఈ నెల 13 నుంచి జూలై 12 వరకు నెల రోజుల పాటు ఈ ప్రత్యేక కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా జరుగుతుందన్నారు. బడిలో చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమాన్ని పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఆయన సూచించారు. పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించి బడి బయట పిల్లలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు.



అవగాహన ర్యాలీలో జిల్లా కో ఆర్డినేటర్ కూర్మారావు

వైద్యసేవల పరిశీలన



లోదొడ్డిలోని సబ్ సెంటర్‌ను సందర్శించిన టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీ, లోదొడ్డి సబ్‌సెంటర్‌ను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించింది. ఆయా కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానికుల నుంచి తెలుసుకున్నారు. వ్యాధినిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఏఎస్‌వో కైలాస్, డీపీవో సతీష్, డీసీఎం, డీసీఎం మనోజ్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, డీఈవో కిషోర్, స్థానిక ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మణరావు, హెచ్ రమాబాయి, ఎంఎల్‌హెచ్‌పీలు భవానీ, కుమారి, లక్ష్మి, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశా వర్కర్లు ఆశమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకంపై అవగాహన కల్పించాలి

- పశుసంవర్ధకశాఖ పాడేరు జేడీ నర్సింహులు



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ నర్సింహులు

పెదబయలు: జిల్లాలో పాడి పశువుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని పశు సంవర్ధకశాఖ పాడేరు జాయింట్ డైరెక్టర్ సీహెచ్ నరసింహులు సూచించారు. శుక్రవారం పెదబయలు పశువైద్య కేంద్రంలో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల పశువైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు వ్యవసాయంతో పాటుగా అనుబంధంగా రైతులు ఆర్థికంగా లాభపడేలా అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో జీవాల పెంపకానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలివ్వాలన్నారు. గిరిజన ప్రాంతంలో జెర్సీ ఆవుల పెంపకం ప్రయోజనాలను పాడి రైతులకు తెలియజేయాలన్నారు.రైతు క్షేత్రాల్లో పశుగ్రాసాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

యాంటీ మలేరియా కార్యక్రమాలు వేగవంతం

- రాష్ట్ర పభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆదేశం
- జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన కలెక్టర్ విజయసునీత, జిల్లా స్థాయి అధికారులు

పాడేరు : జిల్లాలో మలేరియా కేసుల నమోదవుతున్నందున యాంటీ మలేరియా కార్యక్రమాలు విస్తృతం చేయాలని రాష్ట్ర పభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1228 మలేరియా కేసులు నమోదైన నేపథ్యంలో వైద్యసిబ్బంది అప్రమత్తం కావాలని సూచించారు. జిల్లాలో డయేరియా ప్రబలే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు లక్షకు పైగా చిన్నారులు ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియా నివారణపై ప్రజలను చైతన్యవంతుల్ని చేసేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 17 గ్రామ సచివాలయాల పరిధిలో నీటి కాలుష్యం ఉన్నట్టు గుర్తించామన్నారు, ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్, క్లోరినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. నీటి శాంపిళ్లను సేకరించి పరీక్షలు నిర్వహించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. నీటి టెస్టింగ్ కిట్లను ప్రతీ గ్రామ సచివాలయంలో అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిత్యం సిబ్బంది అందుబాటులో ఉండాలని మందులు కొరత లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ డయేరియా నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వచ్చేనెల ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ విజయ సునీత పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఎక్కడ కూడా మందుల కొరత లేదన్నారు. జిల్లాలో 3.75 లక్షల ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, 7500 జింక్ ప్లూయిడ్లు, వంద బ్లీచింగ్ పౌడర్ బ్యాగులు, మెట్రోజిల్, ప్యూరోజిల్, సిప్రాస్ మాత్రలు ఉన్నాయని ఆయన కలెక్టర్‌కు వివరించారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు, డీఎంవో ప్రసాద్‌రావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ పాల్గొన్నారు.



జిరాఫీ దత్తత

- రూ.1.80 లక్షల చెక్కు అందించిన ఫ్లూయింట్ గ్రిడ్ సంస్థ

ఆరిలోవ (విశాఖ): అంతర్జాతీయ జిరాఫీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇందిరాగాంధీ జూ పార్కులోని ఓ జిరాఫీని ఫ్లూయింట్ గ్రిడ్ సంస్థ దత్తత తీసుకుంది. సంస్థ డైరెక్టర్ వాణి గన్నమని సూచనలతో సీనియర్ మేనేజర్ రవికాంత్ రెడ్డి జిరాఫీని ఓ ఏడాది పాటు దత్తతకు రూ.1.80 లక్షల చెక్కును జూ క్యూరేటర్(ఎఫ్ఏసీ) జి.మంగమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా క్యూరేటర్ ఫ్లూయింట్ గ్రిడ్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జూలో వన్యప్రాణుల దత్తత స్వీకార కార్యక్రమం కొనసాగుతోందని, దాతలు ముందుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వన్యప్రాణులు తినే ఆహారం బట్టి వాటి ఖర్చు ఉంటుందన్నారు. జిరాఫీకి ఓ ఏడాదికి రూ.1.80లక్షలు ఖర్చు అవుతుందన్నారు. అరటి పళ్లు, జామ, క్యారెట్, ఉల్లి, ఎర్ర దుంపలు, బత్తాయితో పాటు వేరు శనగ పిండి, బీన్స్, పలు రకాల పప్పులు, పుట్టగొడుగు తదితర వాటిని జిరాఫీకి అందిస్తామన్నారు. ఇవన్నీ కలిపి జిరాఫీ వయసు, అది తినే దాన్ని బట్టి 18 కిలోల నుంచి 20 కిలోల వరకు ఇస్తామన్నారు. వీటితో పాటు మర్రి, తడ తదితర చెట్ల ఆకులను రోజూ ఆహారంగా అందిస్తున్నట్లు వివరించారు. జూ అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్ద జూ క్యూరేటర్‌కు చెక్కు అందజేస్తున్న ఫ్లూయింట్ గ్రిడ్ సంస్థ ప్రతినిధి

క్లుప్తంగా

పాముకాటుతో రైతు మృతి


బాబూరావు మృతదేహం

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగికి చెందిన పాతాళ బాబూరావు (48) అనే రైతు పాముకాటుకు గురై శుక్రవారం రాత్రి మృతి చెందారు. బాబూరావు పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా పాము అతని కుడికాలుపై కాటు వేసింది. ఇది గమనించిన తోటి రైతులు అతనిని వెంటనే స్థానిక పీహెచ్‌సీకు తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం గడుపుతున్న బాబూరావు మృతితో రాజవొమ్మంగిలో విషాదం అలముకొంది. బాబూరావు వైఎస్సార్‌సీపీలో కార్యకర్తగా అన్ని వేళలా చురుకుగా పాల్గొనేవాడని, అతని మృతి పార్టీకు తీరని లోటని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

16 కిలోల గంజాయి స్వాధీనం: ముగ్గురి అరెస్టు


గంజాయితో పట్టుబడ్డ నిందితులతో ఎస్‌ఐ అరుణ్‌కిరణ్

చింతపల్లి: ఒడిశా నుంచి కారులో గంజాయిని తరలిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురుని శుక్రవారం అరెస్టు చేసినట్టు చింతపల్లి ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా నుంచి చింతపల్లి మండలం మామిడిపల్లి మీదుగా గంజాయి తరలిస్తున్నట్టు తమకు సమాచారం వచ్చిందన్నారు. సిబ్బందిని అప్రమత్తం చేసి ఆ ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఆ మార్గంలో ఒక కారు వస్తుండగా తనిఖీలు చేశామన్నారు. కారులో రహస్యంగా అమర్చిన అరలో 16కిలో గంజాయిని గుర్తించినట్టు తెలిపారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన నీతూ, రాణా, రవీంద్రకుమార్‌లు గంజాయిని తరలిస్తున్నట్టు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. మరొకరు పరారీలో ఉన్నారన్నారు. వారి నుంచి కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు రూ.85 వేలు ఉంటుందని ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు.


షూటింగ్‌లో సీనియర్ కెమెరామెన్ యువరాజ్


తాండవ గట్టుపై సినీ హీరో ఆదర్శ బాలకృష్ణ, డైరెక్టర్ గవిరెడ్డి శ్రీనివాస్


సినిమాలో నటించే చిన్నారుల సందడి

స్టార్ట్ కెమెరా.. యాక్షన్


తాండవ జలాశయంలో సినిమా సన్నివేశాల చిత్రీకరణ

- సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా సుందరకోట, తాండవ
- తక్కువ ఖర్చుతో అద్భుతమైన సన్నివేశాల చిత్రీకరణకు నెలవు
- ఏజెన్సీని తలపించేలా మైదాన ప్రాంతంలో ప్రకృతి అందాలు

దట్టమైన అడవుల్లా కనిపించాలి. ప్రకృతి రమణీయతను అణువణువునా సంతరించుకున్న కొండలు, కోనలు, జలపాతాలకు నెలవు కావాలి. సినిమా చిత్రీకరణకు అనువుగా ఉండాలి. అందుకే ఏజెన్సీని తలపించేలా దర్శనమిచ్చే మైదాన ప్రాంతమైన సుందరకోట కొండలు, తాండవ రిజర్వాయర్ అందాలు సినీ దర్శకుల మనసుల్ని కొల్లగొడుతున్నాయి. వరుస షూటింగ్‌లతో సందడి చేస్తున్నాయి.

నాతవరం: మండలంలోని సరుగుడు సుందరకోట ప్రాంతంతో పాటు తాండవ రిజర్వాయర్, దాని పరిసరాలు సినిమా షూటింగ్‌లకు నిలయంగా మారుతున్నాయి. ఈ రెండు ప్రదేశాల్లో ఇటీవల కాలంలో ఐదు సినిమాలకు సంబంధించిన పలు కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. మరింత మంది దర్శకులు, కెమెరామెన్లు, కళాదర్శకులు ఈ ప్రాంతాల్లో పర్యటించి, తమ చిత్రాలకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకుంటున్నారు.

ఆకట్టుకుంటున్న జలపాతాలు, ఘాట్‌రోడ్లు

పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంతో పాటు చూడ చక్కని ప్రదేశాలు అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో ఉన్నాయి. సరుగుడు సుందరకోటలో ఏజెన్సీకి దీటుగా జలపాతాలు, ఘాట్ రోడ్లు ఉండటంతో అందరి చూపు ఇటువైపు మళ్లింది. దీనికితోడు జిల్లాలోని మేజర్ సాగునీటి ప్రాజెక్టు తాండవ రిజర్వాయర్‌పై సైతం సినిమా షూటింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. రెండు కొండల నడుమ చూడముచ్చటగా నిర్మించిన తాండవ ప్రాజెక్టు కనుచూపు మేర కనిపించే రమణీయత కట్టిపడేస్తుంది. ఇటీవల తాండవ ప్రాజెక్టు లోట్టు ప్రాంతంలో నుంచి నాతవరం, గొలుగొండ మండలాలను అనుసంధానిస్తూ నిర్మించిన తారు రోడ్డు సినిమా, షార్ట్ ఫిలిం షూటింగ్‌లకు నెలవుగా మారింది.

ఇప్పుడిప్పుడే సినీ పరిశ్రమ దృష్టికి..

గతంలో అడవులు, కొండలు, జలపాతాల మధ్య షూటింగ్ చేయాలంటే పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేది. మైదాన ప్రాంతమైన సుందరకోట సమీపంలో ఏజెన్సీకి దీటుగా కొండలు, అడవి అందాలతో తక్కువ ఖర్చుతో సినిమా సన్నివేశాలు చిత్రీకరణ పూర్తవుతోందని సినీ ప్రముఖులు చెప్తున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతాలపై పెద్దగా అవగాహన లేకపోవడంతో చాలా డబ్బు, సమయం వృధా చేసుకునేవాళ్లమని, ఇక మీదట ఆ సమస్య ఉండదంటున్నారు. ఇటీవల అనుభవించు రాజా సినిమా డైరెక్టర్ గవిరెడ్డి శ్రీనివాస్, స్థానిక సినీనటుడు ఎల్.జోగినాయుడు ఈ ప్రాంతాల్లో పర్యటించి హైదరాబాద్‌లోని సినీ పరిశ్రమ ప్రముఖుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏడాదిలోనే ఈ ప్రాంతంలో పలు సినిమా షూటింగ్‌లు నిర్వహించారు. ఈ ప్రాంతాన్ని ఒకసారి చూసిన సినిమా డైరెక్టర్లు కొత్తగా తాము తీసే సినిమాల్లో పలు సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించేందుకు ఆసక్తి చూపుతున్నారు.


సుందరకోట కొండపై షూటింగ్ సందడి

షూటింగ్‌లకు అనువైన ప్రదేశం



తక్కువ ఖర్చుతో అధిక సన్నివేశాలు చిత్రీకరించేందుకు చక్కటి ప్రదేశాలు తాండవ రిజర్వాయర్, సరుగుడు సుందరకోట ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ ప్రాంతంపై అవగాహన లేక ఇలాంటి సన్నివేశాల చిత్రీకరణ కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తుంటాం. మారేడుమిల్లి, రంపచోడవరం, సప్పర్ల, సీలేరు, అరుకు ప్రాంతాల్లో ఉండే సుందర ప్రదేశాలు నాతవరం మండలంలోనే ఉన్నాయి. తాండవ సరుగుడు ప్రాంతాల్లో రెండు సినిమాల సన్నివేశాలు చిత్రీకరించాం. ఈ ప్రాంతంలో 25 రోజులకు పైగా చాలా సన్నివేశాల కోసం షూటింగ్ చేశాం.

– శ్రీనివాస్ గవిరెడ్డి, అనుభవించు రాజా సినిమా డైరెక్టర్

పెద్ద సినిమా వాళ్లు అడుగుతున్నారు



సుందరకోట తాండవ ప్రదేశాల్లో సినిమా షూటింగ్‌లకు పెద్ద పెద్ద డైరెక్టర్లు అడుగుతున్నారు. గత ఏడాది నా హయాంలో మూడు సినిమాల షూటింగ్‌లు జరిగాయి. చాలా మంది సినిమా ఆర్టిస్టులు ఈ ప్రాంతంలో షూటింగ్‌లకు వచ్చి లొకేషన్లు బాగున్నాయని అంటున్నారు. గతంలో ఇలాంటి అందమైన ప్రాంతాల కోసం ఇతర దేశాలకు వెళ్లేవారిమని చెప్తున్నారు. తాండవలో రాజేంద్రప్రసాద్, ఆదర్శ బాలకృష్ణ, బెనర్జీ, తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, అల్లరి నరేష్, జోగిబ్రదర్స్‌తో పాటు పలువురి సినిమాలు షూటింగ్‌లు జరిగాయి.

– షేక్, లోకల్ మేనేజర్, రజాక్ సినిమా షూటింగ్

స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక రేపు

అచ్యుతాపురం: జూలై 13, 14 తేదీల్లో కర్నూలు జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఈ నెల 23న అచ్యుతాపురంలోని వెదురువాడ ఆక్సిజన్ రిసార్ట్స్‌లో ఎంపిక చేయనున్నట్లు సిమ్మింగ్ జిల్లా సంఘం కార్యదర్శి సీహెచ్ దేముడు తెలిపారు. 10 నుంచి 17 ఏళ్ల వయస్సు కలిగిన వారిని మూడు కేటగిరీల్లో ఈ స్విమ్మింగ్ పోటీల జట్లకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్ ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్ విభాగాల్లో స్విమ్మింగ్ జట్ల ఎంపిక ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9573690954 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

81 మందికి ఉద్యోగాలు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్క్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. ఆరు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 210 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 165 మంది అభ్యర్థులు హాజరుకాగా..81 మంది ఎంపికై నట్టు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

కొండ చిలువ హతం


హతమైన కొండ చిలువ

రోలుగుంట: మండలంలోని కొవ్వూరు గ్రామంలో ఓ ఇంటి వద్దకు వచ్చిన 12 అడుగుల కొండ చిలువను స్థానికులు హతమార్చారు. వివరాలు. గ్రామా నికి చెందిన యర్రంశెట్టి నర్సింగరావు కుటుంబీకులు శుక్రవారం మధ్యాహ్నం పొలం పనులకు వెళ్లారు. వీరు తమ ఇంటి వద్ద కోళ్లను కూడా పెంచుతున్నారు. సమీప పొలాల నుంచి ఎప్పుడు వచ్చిందో గానీ భారీ కొండ చిలువ స్తంభానికి చుట్టుకుని స్థానికులకు కనిపించింది. దీంతో యవకులు కొండ చిలువను కొట్టి, హతం చేశారు. దీన్ని గుర్తించకపోయి ఉంటే సమీపంలో ఆడుకుంటున్న పిల్లలు ప్రమాదానికి గురయ్యేవారని స్థానికులు చెప్తున్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

నర్సీపట్నం: వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపాల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు డీఎంకే కళాశాల వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకుడు భూషణ్ మాట్లాడుతూ విద్యార్థిని పట్ల ప్రిన్సిపాల్ శౌరి అసభ్యకరంగా ప్రవర్తించటం దురదృష్టకరమన్నారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జ్ఞానేష్, జనార్దన్, మను, దుర్గ, మోహన్ పాల్గొన్నారు. విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపాల్ శౌరిపై నిర్భయ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేధింపులకు నిలయంగా మారిన డీఎంకే కళాశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు.

జీఎస్‌టీ అధికారులకు ముగిసిన శిక్షణ


జీఎస్‌టీ అధికారుల హ్యాండ్‌బుక్‌ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్, ఏడీ రవికిరణ్

సాక్షి, విశాఖపట్నం : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) ట్రైనింగ్ అకాడమీలో కీలక శిక్షణ కార్యక్రమం ముగిసింది. విశాఖ ఏపీలోని కస్టమ్స్, సెంట్రల్ జీఎస్‌టీ, కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు విశాఖలోని అక్కయ్యపాలెంలోని ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా నియమితులైన 48 మంది జీఎస్‌టీ ఇన్‌స్పెక్టర్లతో పాటు ఇతర విభాగాలఅధికారులకు 14 వారాల శిక్షణ ముగింపు కార్యక్రమానికి విశాఖ కస్టమ్స్ అండ్ సెంట్రల్ టాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జీఎస్‌టీ అధికారుల హ్యాండ్‌బుక్‌ని ఆవిష్కరించిన అనంతరం ట్రైనీ అధికారులకు శిక్షణ పూర్తి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ స్మార్ట్ ఇంటిలిజెన్స్‌తో కేసుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు నాసిన్ అదనపు డైరెక్టర్ రవికిరణ్ ఈదర అభినందనలు తెలిపారు.

30 నుంచి రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ మయూర్‌అశోక్

మహారాణిపేట: విశాఖపట్నం వేదికగా పోలీస్ బ్యారక్స్ మైదానంలో ఈ నెల 30వ తేదీ నుంచి 5వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్–జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు పోటీలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను జేసీ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి దివ్యాంగ క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 70135 69514, 93901 31777 ఫోన్ నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేటర్ వై.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్


నెహ్రూచౌక్‌లో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు

అనకాపల్లి: దేశ వ్యాప్తంగా నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో తక్షణమే విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్రకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాల్లో దేశ వ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కి చెందిన వారు కావడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. తక్షణమే ఎన్‌టీఏ వెల్లడించిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి, మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏను రద్దు చేసి, నీట్ పరీక్షల్ని రీ–కండక్ట్ చేయాలన్నారు. ఇటీవలే విడుదలైన నెట్ పరీక్ష ఫలితాల్లో పేపర్ లీకేజీ జరిగిందని గుర్తించిన కేంద్రం, వెంటనే దాన్ని రద్దు చేసిందన్నారు. నీట్ పరీక్షలో ఒక్కో విద్యార్థి నుంచి రూ.30–40 లక్షలు వసూలు చేసినట్లు తెలిసినా పరీక్షను రద్దు చేయకుండా మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల్లో విద్యార్థులకు మైనస్ మార్కులు కూడా ఉండడం జరుగుతుందని, శతశాతం(720) మార్కులు వచ్చిన 67 మందిలో ఇంటర్ ఫెయిలైన వారు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షని రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్తున్నా, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది ప్రతిభ గల విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతున్నారని ఆక్షేపించారు. వైద్య విద్యను వ్యాపారంగా మార్చి, నీట్ పేపర్ లీకేజీకి పాల్పడ్డ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నీట్ పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ జరిపించి, పరీక్షను రద్దుచేసి, మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు జగదీష్, తాతాజీ, రాకేష్, సంపత్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచామృతాభిషేకం

మురళీనగర్ (విశాఖ): కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు శనివారం నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా శ్రీవారికి ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ నిర్వహిస్తారు. అనంతరం వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. జ్యేష్ఠ సుద్ధ పౌర్ణమి సందర్భంగా 108 వెండి కలశాలతో శ్రీగంధం జలాలను తీసుకువచ్చి స్వామికి కలశాభిషేకం చేస్తారు. అనంతరం భక్తులకు స్వామి నిజపాద దర్శనం ఉంటుంది. భక్తులు పాల్గొని తరించాలని ఆయన కోరారు.

త్రిశక్తితో రాక్షస సంహారం


ప్రవచనం చేస్తున్న రమ్యానందభారతీ స్వామిని

సీతంపేట: శ్రీలలితా పీఠంలో గురువుల ఆరాధనోత్సవాలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. త్రిశక్తి వైభవం అను అంశంపై శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతీ స్వామిని ప్రవచనం చేశారు. భువనేశ్వరి దేవి తత్వాన్ని, వైభవాన్ని వివరించారు.

భువనేశ్వరి మాత నుంచి సరస్వతి, లక్ష్మి, పార్వతి అవతరించారని తెలిపారు. మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి.. శక్తి త్రయమని, ఈ శక్తుల కలయికతో రాక్షస సంహారం జరిగిందని వివరించారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైద్యుడిపై హత్యాయత్నం

అల్లిపురం: కేజీహెచ్ వైద్యునిపై హత్యాయత్నం జరిగిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మహారాణిపేట సీఐ వి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కేజీహెచ్‌లో పనిచేస్తున్న జనరల్ ఫిజీషియన్, డాక్టర్ లే (దివ్యాంగుడు) ఉదయం 9.15 గంటలకు నౌరోజీరోడ్డులో తన అపార్ట్‌మెంట్ నుంచి కేజీహెచ్‌కు ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. ఆ సమయంలో అతని మేనమామ పరూష్ గుజారా, అతని కుమారుడు రుచిత్ గుజారాలు కత్తితో దాడికి పాల్పడ్డారు. డాక్టర్ లే ఎడమ కాలు తీవ్ర గాయమైంది. దీంతో అతను మహారాణిపేట పోలీసులకు ఫిర్యాదు చేయటంతో హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.